డీసీసీ అధ్యక్షుడు ఎవరో?



- సంస్థాగత మార్పులపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్ఠానం
- త్వరలోనే జిల్లా అధ్యక్షుడి నియామకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సంస్థాగత మార్పులు చేపట్టాలని నిర్ణయించింది. త్వరలోనే టీపీసీసీ అధ్యక్ష పదవిలో కొత్త నాయకుడిని నియమించి ఆ తర్వాత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను మార్చాలని భావిస్తున్నది. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో పీసీసీకి కొత్త నేతను ఎంపిక చేయనున్నారు. ఆ తర్వాత వెంటనే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల మార్పు ఉంటుందని చెబుతున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కొత్త నేత రాబోతున్నారని సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ వ్యవహరిస్తున్నారు. ఆయన మానకొండూర్ శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. జోడు పదవులు ఒకరికే కట్టబెట్టడం కంటే సంస్థాగత అధ్యక్ష పదవిని పూర్తికాలం వెచ్చించే నాయకుడికి ఇస్తే పార్టీ వ్యవహా రాలు చురుకుగా కొనసాగించవచ్చని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం తదితర కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అందుబాటులో ఉండడానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలోనే డీసీసీ అధ్యక్షుడి మార్పు అనివార్యమైంది.

- కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడిగా, కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా పార్టీకి చాలా కాలం నుంచి సేవలందిస్తున్నారు. వీరిలో నరేందర్‌రెడ్డికి ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు ముందు సుడా ఛైర్మన్ పదవి దక్కినా ఎన్నికల కోడ్ కారణంగా బాధ్యతలు చేపట్టలేదు. ఈలోగానే రాష్ట్రస్థాయిలో జరిగిన 37 మంది ఛైర్మన్ పదవుల నియామక వ్యవహారంలో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కొంత అసంతృప్తి వ్యక్తం కావడంతో అవి ఉంటాయా... లేక మళ్లీ కొతగా నియామకాలు చేపడతారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.
- బొమ్మ శ్రీరాంచక్రవర్తి ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిసున్నారు. ఆయన గతంలో హౌస్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఫలితం దక్కకుండా పోయిన తర్వాత ఆయన బీజేపీలో చేరారు. ఆయన ఇటీవల సొంత గూటికి చేరారు. ఈ సందర్భంలోనే ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనకు రాజకీయ భవిష్యత్ ఉంటుందని, డీసీసీ అధ్యక్షుడిగా ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.
- కాంగ్రెస్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించి పార్టీ నగర అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసిన ఆకారపు భాస్కర్‌రెడ్డి ఆ తర్వాత తనకు రాజకీయ ప్రాధాన్యం తగ్గడంతో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన కూడా ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ ఆ రేసులో ఉన్నారు.
- టీపీసీసీ కార్యదర్శిగా పార్టీకి సేవలందించిన వైద్యుల అంజన్‌కుమార్ పార్టీ అధికారంలో లేని సమయంలోనూ ఇతర పార్టీల్లో చేరకుండా కాంగ్రెస్‌లోనే ఉంటూ వచారు. ఈ నేపథ్యంలో తనకు జిల్లా అధ్యక్ష పదవి అప్పగించాలని కోరుతున్నారు. సుడా ఛైర్మన్ పదవిని కూడా ఆయన ఆశిస్తూ విన్నపాలు చేసుకున్నారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారి జాబితాలో ఈ పేర్లు వినిపిస్తుండగా మరికొందరు కూడా ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ మదిలో ఎవరున్నారో.. ఎవరిని అదృష్టంవరించనున్నదో.. అన్నది పార్టీవర్గాల్లో చర్చగా మారింది. జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం మద్దతు కూడా ఎవరికి లభిస్తుంది అనేది కీలకంగా మారింది.

● రేసులో పలువురు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసులో ప్రస్తుతం కార్యనిర్వహక అధ్య క్షుడిగా ఉన్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా ఉన్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ ఉన్నారని ప్రచారం జరుగుతోంది. వీరందరూ రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ పదవులు, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులు కోరుకుంటున్నారు. ఆ పదవుల భర్తీలో కొందరికి అవకాశం దక్కితే వారు పోటీ నుంచి తప్పుకునే అవకాశముంది. నామినేటెడ్ పదవుల పంపిణీ ముందు జరిగితే వారికి పదవులు దక్కేది రానిది తేలుతుంది కానీ ఆ లోగానే డీసీసీ అధ్యక్షుల నియామకం జరిగితే వారు పోటీలోనే ఉం టారు. నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లా మంత్రి నుంచి స్పష్టమైన హామీ లభిస్తే కొందరు డీసీసీ రేసు నుంచి తప్పుకునే అవకాశమున్నది.

రేపు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాక

- బాధ్యలు స్వీకరించిన తర్వాత తొలిసారి కరీంనగర్‌కు..
- ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణుల ఏర్పాట్లు

భగత్‌నగర్, జూన్ 17: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం కరీంనగర్‌కు రానున్నారు. 19న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లిద్దరు కరీంనగర్ రావాలని భావించినా అదే రోజు కేంద్ర కేబినెట్ భేటీ ఉండడంతో కిషన్‌రెడ్డి ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారి బండి సంజయ్ కరీంనగర్‌కు రానుండడంతో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యారు.



19న శనిగరం వద్ద స్వాగతం అనంతరం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం, చైతన్యపురిలోని తన మాతృమూర్తి ఆశీస్సులు తీసుకుని కొండగట్టువెళ్లనున్నారు. చొప్పదండి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలతో భేటీ అనంతరం నల్లగొండ లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం అనంతరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించనున్నారు. ఏడు గంటలకు సిరిసిల్ల మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గ నాయకులను కలుసుకుంటారు. 20న మధ్యాహ్నం వరకు కరీంనగర్‌లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం హైదరాబాద్ వెళ్లి కేంద్ర మంత్రికిషన్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 21న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. 22న కరీంనగర్‌లోని శివాలయం, రామేశ్వరాలయం, భగత్‌నగర్ అయ్యప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానుండడంతో 23న ఢిల్లీ వెళతారు.



కరీంనగర్ సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్

- ఈద్గాలు, మసీదుల్లో ప్రార్థనలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 17: భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని అన్ని మసీదులు, ఈద్గాలతో పాటు గ్రామాలు, మండల కేంద్రాలలోని మసీదులలో సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ప్రార్థనలు చేయించి, సందేశమిచ్చారు. రేకుర్తి సాలెహ్‌నగర్, కళాభారతి వద్ద, బైపాస్ రోడ్, చింతకుంటలో గల ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది సేవలందించారు. ముస్లింలు మాంసంలో ఒక భాగం బంధువులకు, మరో భాగం పేద వారికి, ఇంకో భాగం కుటుంబ సభ్యులకు అందజేశారు. గత ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న గొర్రెల అమ్మకాల సందడి ఆదివారం రాత్రి నుంచి ఊపందుకుంది. పలు కూడళ్లలో, నగర శివార్లలో వివిధ గ్రామాల నుంచి విక్రయదారులు గొర్రెలు, మేకలు, పొట్టేళ్లను తీసుక వచ్చి అమ్మగా ముస్లింలు కొనుగోలు చేశారు. సాలెహ్‌నగర్‌లో సదర్ ఖాజీ మన్ ఖబత్ షా ఖాన్ నమాజ్ చేయించగా మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఎంఐఎం కార్పొరేటర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. మేయర్ యాదగిరి సునీల్ రావు నివాసానికి వచ్చిన ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపల్లి మండలం చింతకుంట, ఎలగందుల, బావుపేట, ఆసిఫ్‌నగర్, గ్రామాలల్లో, కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, ఆరెపల్లి దర్గాలో, ఫకీర్‌ఖాన్‌పేట, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామంలో ఈద్గాల వద్ద బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మసీద్‌ల వద్ద సామూహిక ప్రార్థనలు చేసి మత పెద్దలు ప్రార్థనలు చేశారు.



ప్రత్యేక ప్రసంగాన్ని వింటున్న ముస్లింలు

నేడు బల్దియా అధికారులతో మంత్రి 'పొన్నం' రివ్యూ

- అభివృద్ధి, అవినీతి, సమస్యలపై చర్చించే అవకాశం

కరీంనగర్ టౌన్, జూన్ 17: రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నగరపాలక సంస్థపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనుల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ వచ్చిన ఆరోపణలు, చాలా పనులు అసం పూర్తిగా వదిలిపెట్టడంపై ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నగరపాలక సంస్థలో కీలకమైన విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు సెలవుల్లో వెళ్లారని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందనే విషయాలను మంత్రికి వివరించినట్లు తెలిసింది.



పార్లమెంట్ ఎన్నికల అనంతరం నగరపాలక సంస్థపై దృష్టిపెడతానని నాయకులకు మాట ఇచ్చిన మంత్రి పొన్నం 12న బల్దియా అధికారులతో సమీక్ష నిర్వ హించాలని నిర్ణయిం చారు. ఈమేరకు కమిషనర్‌కు సమాచర మివ్వడంతో అధికారులు దస్త్రాలను సిద్ధం చేసుకు న్నారు. ఆరోజు మంత్రి రివ్యూ రద్దు కావడంతో మంగళవారం ఉద యం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహి స్తారని సమాచారమిచ్చారు. దీంతో అధికారులు సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమీక్షలో మంత్రి తీసుకునే నిర్ణయాలతో బల్దియాలో భారీ మార్పులు చోటు చేసుకుంటుందని, ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమిస్తారని, అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తారని, ఖాళీలను భర్తీ చేయిస్తారని ఆ పార్టీ కార్పొరేటర్లు చెబుతున్నారు.

విద్యుత్ శాఖలో 'ప్రజావాణి' ప్రారంభం

- మొదటి రోజు 20 ఫిర్యాదులు

గణేశ్‌నగర్, జూన్ 17: విద్యుత్ శాఖలో సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు 20 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎస్ ఎస్ఈ గంగాధర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి రోజు సర్కిల్ ఆఫీస్‌కు చెందినవి ఏడు, కరీంనగర్ టౌన్, కరీంనగర్ రూరల్, హుజూరాబాద్ డివిజన్లకు సంబంధించిన 13 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటి పరిష్కారానికి సంబంధిత సెక్షన్లకు పంపించామని చెప్పారు. కార్యక్రమంలో సీజీఎం రాజీవ్ చౌహాన్, డీఈ రాజం, ఎస్ఏవో రాజేశం, ఏవో అరవింద్, పీవో చంద్రయ్య, ఏడీలు లావణ్య, స్వప్న, వీణ, పండరి పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ గంగాధర్

కరీంనగర్ రీజనల్ ఇంటలిజెన్స్ ఎస్పీ బదిలీ

కరీంనగర్ క్రైం, జూన్ 17 : కరీంనగర్ రీజనల్ ఇంటలిజెన్స్ ఎస్పీ బి రాజమహేంద్రనాయక్ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం 28 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఇందులో కరీంనగర్ రీజనల్ ఇంటలిజెన్స్ ఆఫీసర్ (ఆర్ఐఓ)గా ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్పీ బి రాజమహేంద్రనాయక్ (నాన్ కేడర్)ను జనగాం వెస్ట్‌జోన్ డీసీపీగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ ఆర్ఐవోగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

దుకాణాల క్రమబద్ధీకరణకు డబ్బుల డిమాండ్?

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫిర్యాదు చేసిన దుకాణదారులు

హుజూరాబాద్, జూన్ 17: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బీసీ హాస్టల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ క్రమబద్ధీకరణకు మున్సి ఎల్ పాలకవర్గంలోని కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై మూడు రోజుల క్రితం దుకాణాదారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దుకాణదారులు మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి కలెక్టర్‌తో మాట్లాడినట్లు సమాచారం. ఐదేళ్ల క్రితం అప్పటి పాలకవర్గం చిరు వ్యాపారుల కోసం బీసీ హాస్టల్ ఎదుట షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించింది. ఇందుకు గాను అప్పటి పాలకవర్గ సభ్యులు ఒక్కో షట్టర్‌కు దుకాణదారుల నుంచి లక్ష రూపాయలు వసూలు చేసి సగంలోనే వదిలిపెట్టారు. మిగితా పనులను దుకాణదారులే పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు ఒక్కో షెట్టర్‌కు 50 వేలు ఇవ్వాలని దుకాణదారులను డిమాండ్ చేశారు. లేకుంటే ఈ షట్టర్లను స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. దీంతో వారు భందోళనకు గురవుతున్నారు. గతంలో సైదాపూర్ రోడ్‌లో ఈటల కాంప్లెక్స్ పేరిట ఐబీ పరిధిలో షెటర్లు నిర్మించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఒక్కొక్కరి వద్ద నుంచి 50 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బీసీ హాస్టల్ ఎదుట ఉన్న షట్టర్లకు డబ్బులు డిమాండ్ చేయడంతో లబ్ధిదారులు ఇవ్వబోమని భీష్మించుకు కూర్చున్నారు. మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు లబ్ధిదారులు సిద్ధమవుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



హుజూరాబాద్‌లో బీసీ హాస్టల్ ఎదుట ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూన్ 17: ధర్మపురి లక్ష్మీనరసింహుడి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి తోడుగా సెలవు దినం కావటం వల్ల ఉదయం వరకు క్షేత్ర నలుమూలల నుంచి భక్తులు చేరుకున్నారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం చేయించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి జలంతో అభిషేకం జరిపి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 17: హోంగార్డు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ ఆపి పేపర్లు పరిశీలించారు. అవి సరిగా లేక పోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని హోంగార్డు రవీందర్‌ను ఆదేశించారు. టాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో శ్రీదేవి రైస్ మిల్లు వద్ద ట్రాక్టర్ యాజమాని అడ్డుకొని హోంగార్డును కిందకు దించి ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లాడు. విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో డ్రైవర్ అనిల్‌కుమార్, యాజమాని నాగరాజు, బండ అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పిల్లలను కాపాడబోయి.. నీటిలో మునిగి తండ్రి మృతి





రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుడు విజయ్‌కుమార్ (ఇన్‌సెట్లో)

ఇద్దరు పిల్లలను కాపాడిన జాలర్లు

తిమ్మాపూర్, జూన్ 17: నీటిలో మునిగిపోతున్న పిల్లలను కాపాడబోయి ఓ తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ (వర్క్స్ అండ్ ప్రాజెక్టు) డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బంగారి విజయ్ కుమార్ (47) తన కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నాడు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి, కూతురు సాయినిత్య, కుమారుడు విక్రాంత్, అత్త పుష్పలతతో కలిసి సోమవారం ఉదయం హుస్నాబాద్‌లోని పొట్లపల్లి శివాలయానికి వెళ్లారు.

దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో దిగువ మానేరు జలాశయం వద్దకు వెళ్లారు. కాకతీయ మెయిన్ కెనాల్ దిగువకు నీటిని విడుదల చేసే రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో రెగ్యులేటరీ సమీపంలో ఉన్న స్టాండింగ్ పాయింట్ వద్దకు వెళ్లిన సాయినిత్య ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయింది. సాయినిత్యను కాపాడేందుకు విజయ్‌కుమార్ నీటిలో దూకాడు. వీళ్లను చూసిన కుమారుడు విక్రాంత్ కూడా నీళ్లలోకి దూకాడు. అతడూ మునిగి పోవడం ప్రారంభించాడు. వారిద్దరిని విజయ్‌కుమార్ గట్టువైపునకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు. గట్టున ఉన్న విజయ్‌కుమార్ భార్య ప్రశాంతి కాపాడండి అంటూ కేకలు వేసింది. అక్కడికి సమీపంలో ఉన్న శంకర్ అనే జాలరి గమనించి వెంటనే వారి వద్దకు వెళ్లి పిల్లలను బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే అలిసిపోయిన విజయ్‌కుమార్ నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. ఎల్ఎండీలో మునిగి విజయ్‌కుమార్ మృతి చెందిన సంఘటన తెలిసిన వెంటనే మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లలను కాపాడిని శంకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పిల్లలను కాపాడిన జాలరి శంకర్

పాడి రైతుకు దిగాలు!

- రోజు రోజుకీ తగ్గుతున్న ఆవు పాల ధరలు
- ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహం కరువే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు, డెయిరీ నిర్వాహకులు



డెయిరీలోని ఆవులు

మల్యాల, జూన్ 17: ఆవు పాల ధరలు రోజురోజుకీ తగ్గడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న డెయిరీలను మరింతగా ప్రోత్సాహించా ల్సింది పోయి పాల ధరలు తగ్గిస్తూ ఆవేదనకు గురి చేస్తున్నారు. క్షీర విప్లవంలో భాగంగా కొన్నాళ్ల క్రితం వరకు గ్రామాల్లో డెయిరీలను ప్రోత్సహిం చడంతో అనేక మంది ఆవులు, గేదెల ఫామ్‌లు ఏర్పాటు చేశారు. వాటి నుంచి నిత్యం పాలను సేకరిస్తూ ధరలకు అదనంగా ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పాడి రైతులకు ఇచ్చేవారు. అయితే ఇటీవల వాటిని ఎత్తివేయడమే కాకుండా ఎప్పుడూ చెల్లించే పాల ధరలను తగ్గించ డంతో తమకు డెయిరీల నిర్వహణ భారంగా మారిందని దిగాలు చెందుతున్నారు. ఆవులు, గేదేలకు అందించే దాణ ఇత రాత్రా ఖర్చు లు పెరుగుతుండడానికి అనుగుణంగా పాల ధరలను కూడా క్రమేపీ పెంచాల్సింది పోయి తగ్గించడం సరికాదని ఇలాగైతే తాము డెయి రీలను మూసుకోవడమే శరణ్యమని అంటున్నారు.

● ఎనిమిది నెలల్లో రూ.7 తగ్గింపు

లీటర్ ఆవు పాలకు గత సెప్టెంబర్, అక్టోబర్ నెలలో కరీంనగర్ డెయిరీ వాళ్లు రూ.43చెల్లించగా ప్రస్తుతం రూ.35.65మాత్రమే ఇస్తు న్నారని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పాడి రైతులు తెలిపారు. లీటర్‌కు దాదాపు రూ.7కు పైగా తగ్గిందని ఇలాగైతే నిర్వహణ ఎలా అంటూ ఆవేదన చెందుతున్నారు. 50లీటర్లు ఆపై పాలు సేకరిస్తే లీటర్‌కు రూ.35.65తో పాటు రూ.1, 100లీటర్లకు రూ.2 ఇలా పాలు పెరిగిన కొలది ఇన్సెంటివ్ పెంచుతూ వాటిని అందిం చేవారు. అయితే ఇటీవల అందించడం లేదని పైగా పాల ధరలను కూడా గణనీయంగా తగ్గిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. మల్యాల మండలం తాటిపల్లితో పాటు పలు గ్రామాల్లో, రాయికల్, జగిత్యాల తదితర మండలాలల్లో డెయిరీలు ఉండగా కొన్ని చోట్ల కరీంనగర్ డెయిరీ వాళ్లు వందలాది లీటర్ల పాలు సేకరణ చేస్తున్నా రు. అయితే ఇటీవల ధరలు తగ్గించడంతో నిర్వహణ భారంగా మా రుతుందని లీటర్‌కు రూ.7వరకు తగ్గుదలతో అప్పులతో డెయిరీలను మూసివేయడమే శరణ్యమని అంటుండగా కొన్నాళ్ల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ధరల పెంపునకు కృషి చేయాలని కోరారు.

అలాగే ప్రభుత్వం లీటర్ పాలకు చెల్లించే రూ.4 ప్రోత్సాహం కొన్నేళ్లగా రావడం లేదని పాడి రైతులు అంటున్నారు. ఇటీవల వెన్న శాతం తక్కువ వచ్చే వారికి కోతలు గతంలో కన్నా రెట్టింపు చేయడం మరింత ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొంటున్నారు. మరింత ప్రోత్సాహించాల్సింది పోయి మూసివేసుకునే రీతిలో వ్యవహరిస్తున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవు పాల దిగుమతులు పెరుగడంతోనే ధరలు తగ్గిస్తున్నట్లు తెలుస్తుంది. కరీంనగర్ డెయిరీ సూపర్ వైజర్ మహిపాల్ రెడ్డిని సంప్రదించగా ధరల పెంపు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ తామని తెలిపారు.

ధర తగ్గింపుతో నష్టం..: తూకుంట్ల రవీందర్‌రెడ్డి, తాటిపల్లి



పాల ధరలను తరచూ తగ్గించడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. దాణా, నిర్వహణ ఖర్చులు పెరు గుతున్న నేపథ్యంలో పాల ధరలను కూడా పెంచాల్సి ఉండగా పెంచకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోంది. ధరల తగ్గింపుతో నా ఒక్కనికే దాదాపుగా రూ.30వేల వరకు నష్టపోవాల్సి వస్తుందంటే మిగితా వాళ్లు ఎంత నష్టపోతున్నారో తెలుస్తుంది. ధరలను పంచడమే కాకుండా ఇన్సెంటివ్, ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

మృతదేహం కోసం తండ్రి, భార్య వర్గాల మధ్య గొడవ

కరీంనగర్ క్రైం, జూన్ 17: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా కరీంనగర్ శివారులోని చంద్రాపూర్‌కాలనీలో వల్లపు స్వామి(36) ఆది వారం రాత్రి 11 గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి మృతదేహానికి సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కరీంనగర్ రూరల్ పోలీసులు పంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. కాగా మృతదేహాన్ని తామే తీసుకువెళతామని మృతుడి భార్య, కాదు తామే తీసుకువెళతామని మృతుడి తండ్రి వర్గాలకు చెందినవారు గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకోగా మృతుడి భార్య స్వాతితోపాటు ఇరు వర్గాలకు చెందిన మరి కొందరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరు వర్గాలను చెరగొట్టి అక్కడి నుంచి పంపించివేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన వల్లపు స్వామి, తన భార్య స్వాతి, ఇద్దరు పిల్లలతో కలిసి ఆరు నెలల కిందట కరీంనగర్‌కు వచ్చి చంద్రాపూర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తరచుగా స్వామి, స్వాతి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న స్వామిభార్య పుట్టింటికి(కొత్తగూడెం) వెళ్లి పిల్లల సర్టిఫికెట్లు తీసుకుని ఆదివారం కరీంనగర్‌కు వచ్చింది. అయితే అక్కడ ఉన్న కోళ్లు, బియ్యం ఎందుకు తీసుకు రాలేదని స్వామి రాత్రి 9 గంటలకు తన భార్యతో గొడవపడి ఆమెను కొట్టాడు. దీంతో అతని భార్య సమీపంలోని బంధువుల ఇంటిలో పిల్లలతో కలిసి నిద్రిచింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న స్వామి రాత్రి 11 గంటలకు తన బంధువులకు వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలో ఉన్న బంధువులు వచ్చి చూసేసరికి స్వామి ఉరికి వేళాడుతూ కనిపించాడు. ఈ విషయం మృతుడి భార్య బంధువు లకు తెలిపింది. సోమవారం ఉదయం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం మృతదేహం తీసుకువెళ్లే విషయంలో ఇరువర్గాలు గొడవపడ్డారు.

స్వామికి దామెరలో ఇల్లులేదని, అక్కడ కార్యక్రమాలు నిర్వహించటం కష్టమవుతుందని మృతుడి భార్య స్వాతి, ఆమె సోదరులు వాదిస్తూ స్వామి మృతదేహాన్ని వరంగల్ జిల్లా నర్సంపేట వద్ద కొత్తగూడకు తీసుకువెళతామని పట్టుబట్టారు. అయితే తన కొడుకు మృతదేహాన్ని తన గ్రామం దామెరకే తీసుకువెళతామని తండ్రి జంపయ్య, మృతుని సోదరులు పట్టుబట్టారు. ఈ గొడవలో ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకున్నారు. అక్కడే ఉన్న ఒక అంబులెన్స్ అద్దాలు కూడా రాళ్ల దెబ్బకు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి మృతుడి తండ్రి జంపయ్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.



గొడవలో తలకు గాయంతో మృతుడి భార్య స్వాతి

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 17: ఒంటిపై వేడినీళ్లు పడి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి యాదగిరి (64) ఆదివారం మృతిచెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. సప్తగిరి కాలనీకి చెందిన యాదగిరి ఈ నెల 7న ఉదయం స్నానం కోసం వేడినీళ్లు తీసుకెళ్తూ జారి కిందపడగా వేడి నీళ్లు అతని ముఖం, ఇతర చోట్ల పడి గాయాలయ్యాయి. అతన్ని కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చిప్పలపెల్లిలో రెండిళ్లలో చోరీ

ముస్తాబాద్, జూన్ 17: మండలంలోని చిప్పలపెల్లి గ్రామంలోని రెండిళ్లలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిచర్ల నర్సవ్వకు చెందిన ఇంట్లో రూ. 1.85 లక్షలు, తులం వెండి, గాడిచర్ల నరేశ్ ఇంట్లో బంగారు గుండ్లు, చెవుల కమ్మలు, చిన్న చెవికమ్మలు, దాదాపు రెండు తులాల వెండి పట్టగొలుసులు, రెండు జతల వెండి బ్రాస్ లెట్, చిన్న పిల్లల పట్టగొలసులు, నడుము వెండి ఎత్తుకెళ్లారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నేత కార్మికుడి మృతి



శేఖర్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 17: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడాల శేఖర్ (55) అనే నేత కార్మికుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రం ఇందిరనగర్‌కు చెందిన నేత కార్మికుడు శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పద్మనగర్ శివారులో ప్రమాదవ శాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు

మానకొండూర్, జూన్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి-ఖాదర్‌గూడెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న టీఎస్ 09 జెడ్ 8112 ఆర్టీసీ బస్సును వరంగల్ నుంచి ఎదురుగా వస్తున్న టీఎస్ 02 ఈహెచ్ 5683 నుంబరు గల కారు ఢీకొంది. కారు వెనకాల వస్తున్న బైక్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శివకుమార్, అతని భార్య నితీష, బైక్‌పై వస్తున్న లక్ష్మణ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితుల నిరసన



గల్ఫ్ ఏజెంట్ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

కోనరావుపేట, జూన్ 17: విదేశాలకు పంపిస్తానని పలువురిని మోసం చేసి గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితులు సోమవారం నిరసనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ చెలిమెల అలియాస్ చందనగిరి తిరుపతి విదేశాలకు పంపిస్తానని పలువురి వద్ద 10 లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఏడాదిన్నర గడిచినా పంపించక పోవడంతో బాధితులు కుటుంబసభ్యులతో సహా ఏజెంట్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన వెంగలి దేవయ్య, తాళ్లపల్లి రాజు, వెంగలి నవీన్, ఊరడి రాములు, కొలనూరుకు చెంది న బత్తిని రమేష్, నిజామాబాద్‌కు చెందిన ఊరడి మధు, పిట్టల రవిని యూరప్ పంపిస్తానని 10 లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. తమకు చెప్పకుండా దుబాయ్ వెళ్లిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించడానికి తిరుపతి గడువు కోరడంతో బాధితులు శాంతించారు.

ఆటో, బైక్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూన్ 17 : మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో సోమవారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లి నుంచి మన్నెంపల్లి వైపు వెళుతున్న ఆటో, ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన దొంత బాబు, మంద శ్రీనివాస్ తీవ్రగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి తగదాలో మూకుమ్మడి దాడి

ఒకరి మృతి

ఎనిమిది మందిపై కేసు నమోదు

కోరుట్ల రూరల్, జూన్ 17 : కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న ఆస్తి తగాదా ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. మండలంలోని మోహన్‌రావుపేటలో సోమవారం కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఒక్కరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై రాజేష్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల మండలంలో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట గంగరాజంకు ఇద్దరు కుమారులు కోట రాజేష్, కోట రాకేశ్ ఉన్నారు. గ్రామంలో ఉన్న ఆస్తి పంపకంపై కొన్ని రోజులుగా వీరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గంగరాజం కుటుంబ సభ్యులు సమీప బంధువులతో ఆస్తి పంపకం విషయమై మరో మారు సమావేశం అయ్యారు. పంపకాల విషయంలో ఉదయం నుంచి పలు మార్లు రాజేష్‌ను సముదా యించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో అక్కడే ఉన్న తమ్ముడు రాకేష్ కోపోద్రిక్తుడై కత్తితో రాజేష్‌పై దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో తండ్రి గంగరాజంతో పాటు బంధువులు రాజేష్‌పై దాడి చేయడంతో అప్పటికే రాజేష్ అపస్మారకస్థితికి వెళ్లాడు. దీంతో అక్కడే ఉన్న రాజేష్ భార్య లాస్య గ్రామస్థుల సహకారంతో హుటా హుటిన కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు బంధువులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో రాజేష్ మృతి చెందాడు.

గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో పరిశీలన జరిపారు. రాజేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజేష్ హత్య కేసులో ఎనిమిది మందిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సోదరుడు రాకేష్‌తో పాటు తండ్రి గంగరాజంతో పాటు బాబాయిలు మంచాల రాజేశం, కోట గంగారాజం, లింగంపల్లి నరేష్ (రాకేష్ స్నేహితుడు), కోట మానస, కోట మల్లు, మంచాల లక్ష్మిలపై కేసు నమోదు చేశారు.



రాజేష్ (ఫైల్)

చెరువు మట్టి హాంఫట్ !

● అనుమతికి మించి అక్రమ తరలింపు ● పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

మల్యాల, జూన్ 17: చెరువు మట్టి అక్రమంగా తరలుతోంది. అధికారులు, నాయకుల అండదండలతో అనుమతికి మించి తరలిస్తున్నారు. ఇటుకబట్టీలకు వేలాది క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలుతున్నప్పటికీ ఇరిగేషన్, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే మట్టి అక్రమార్కులకు వరంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో గల రేణికుంట చెరువు నుంచి మట్టిని గత రెండు రోజులుగా అనుమతికి మించి అక్రమంగా తరలిస్తుండడంతో గ్రామస్థులు ఆదివారం డయల్ 100కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ మట్టి తరలింపు కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● అనుమతికి మించి తరలింపు..

రేణికుంట చెరువులో మట్టిని వెయ్యి క్యూబిక్ మీటర్ల వరకు తరలింపునకు కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. 12మీటర్ల లోతు తవ్వకాలతో కేవలం ఆరు వాహనాలలో మాత్రమే తరలించడానికి ఇరిగేషన్ ఈఈ ఆర్డర్ ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు 30 వాహనాలలో మట్టిని తరలించారని అనుమతికి మించి మట్టిని తీస్తున్నారని గ్రామస్థులు పోలీస్‌శాఖ 100 డయల్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులు ఉన్నాయంటూ సదరు పోలీసులు వెళ్లి పోయారని స్థానికులు తెలిపారు. వారం రోజులుగా ఇదే ప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను, అయిదు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం ఆరు వాహనాలకే అనుమతి ఉన్నప్పటికీ పదుల సంఖ్యల వాహనాల్లో తరలిస్తున్న పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని దీంతో ప్రభుత్వం సీనరేజిని కోల్పోతుండగా అక్రమార్కులకు చెరువు మట్టి కల్ప తరువుగా మారిందని పేర్కొం టున్నారు.

చర్యలు తీసుకుంటాం

: తిరుపతి, డీఈ, ఇరిగేషన్

అనుమతికి మించి తరలిస్తే తగు చర్యలు తీసుకుంటాం. ఆరు వాహనాలకే అనుమతి ఇవ్వడం జరిగింది. మట్టి తవ్వకాలు ఎక్కువగా చేస్తే క్యూబిక్ మీటర్ల వారీగా ఫీజు వసూలు చేయడం జరుగుతుంది. ఎక్కువ తవ్వకాలు చేయకుండా పరిమితికి మించి వాహనాల్లో తరలకుండా అక్కడే ఉండే తమ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.



టిప్పరులో తరలిస్తున్న మట్టి

ఫోర్ లైన్‌కు మోక్షమెప్పుడో?

- ప్రమాదకరంగా కొదురుపాక -నందికమాన్ రోడ్డు
- తరచూ ప్రమాదాలతో ఆందోళన
- రోడ్డు విస్తరణ చేపట్టాలని వాహనదారుల డిమాండ్



నాంపల్లి ఘాట్ రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా రహదారి

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తారు. ముఖ్యంగా వరంగల్, హన్మాకొండతోపాటు కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు అధికంగా ఉంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తుంటాయి. కరీంనగర్ నుంచి కొదురుపాక వరకు ఫోర్‌వే లైన్ రోడ్డు పూర్తయ్యింది. సిరిసిల్ల నుంచి వేములవాడకు నాలుగు వరుసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. కానీ కొదురుపాక గ్రామం నుంచి నాంపల్లి నందికమాన్ వరకు ఫోర్ వే రోడ్డు మంజూరు కాకపోవడం, రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కొదురుపాక గ్రామం నుంచి ప్రధాన రహదారిని ఆనుకొని పునరావాస కాలనీలు ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి కాలనీలు వెలిశాయి. దీంతో రోడ్డు కాస్తా రద్దీగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోర్ వే లైన్ మంజూరు చేయాలని స్థానికులు పలు మార్లు అధికారులు, ప్రజానిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఫోర్ వే లైన్ రోడ్డుకు మాత్రం మోక్షం లభించలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాలుగు వరసల రోడ్డు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలలో ముగ్గురు మృతి..

కొదురుపాక శివారు నుంచి నాంపల్లి నందికమాన్ చౌరస్తా వరకు రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో ఇటీవల డీసీఎం వ్యాన్, లారీ ఢీకొన్న ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన బాపురెడ్డి అనే డీసీఎం వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరెపల్లి గ్రామంలో చీర్లవంచ గ్రామానికి చెందిన దేవా రాజు అనే యువకుడు, రుద్రవరం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన పర్శరాములు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌అండ్ బీ, పోలీస్ అధికారులు బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పా టు చేసినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టి నివారించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణతోనే ప్రమాదాల నివారణ

మేర్గు లక్ష్మణ్, వాహనదారుడు, నాంపల్లి



కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. రాత్రి పూట వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. రోడ్డు చిన్నగా ఉండడంతో నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డును విస్తరిస్తే తప్పా రోడ్డు ప్రమాదాలను నివారించలేం.

ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయం

పండుగ శంకర్, వాహనదారుడు, సంకెపల్లి



సంకెపల్లి గ్రామం నుంచి వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంటుంది. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్డు చిన్నగా ఉంది. ఆరెపల్లి నుంచి నందికమాన్ వరకు రోడ్డుకు ఇరువైపుల గ్రామాలు ఉండడంతో రోడ్డు చుట్టూ నిత్యం ప్రజలు, వాహ నాలతో బిజీబిజీగా కనిపిస్తుంది. ఫోర్‌లైన్ రోడ్డును వీలైనంత త్వరగా చేపడితే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టు వేయవచ్చు.

ఫోర్‌వే నిర్మించాలి: కాసర్ల అరుణ్, రుద్రవరం



రుద్రవరం సమీపంలో రోడ్డుకు రెండు వైపుల ఇళ్లు ఉంటాయి. అటు వైపు వెళ్దామంటే భయంగా ఉంటుంది. రోడ్డుపైన స్పీడ్‌ను కంట్రోల్ చేసేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. వాహనాలు స్పీడ్‌గా వెళ్లడంతో వాటి వేగాన్ని అంచన వేయకుండా రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫోర్ వే లైన్ రోడ్డును వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలి.

జిల్లాలో ఘనంగా బక్రీద్ వేడుకలు



శంకరపట్నంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రామడుగులో ప్రత్యేక ప్రార్థనలు



మానకొండూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

హుజూరాబాద్, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమాధుల వద్ద పువ్వులు చల్లి ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లీం సోదరులు బక్రీద్ పర్వదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాయ్.. బలాయి తీసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వీణవంక: మండలంలోని చల్లూరు,వీణవంక గ్రామల్లో ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లింలు ఉదయన్నే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలో బక్రీద్ వేడుకలు ముస్లిలు ఘణంగా నిర్వహించారు. ఉదయాన్నే నూతన దుస్తులు ధరించి పట్టణంలోని కోరపల్లి రోడ్డులో గల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో ముస్లిం సోదరులు ఈదుల్ జుహా పండుగ జరుపుకున్నారు. ఈద్గాలో సామూహిక నమాజు, ప్రార్థనలు చేశారు. మత గురువు మౌలానా నౌమన్ హష్మీ ఖురాన్‌లోని సూక్తులను చదివి వినింపించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వహణ అధ్యక్షులు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, కార్యదర్శి మొహమ్మద్ జమాల్, అష్రఫ్, సంయుక్త కార్యదర్శి నైముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మానకొండూర్ : మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. మానకొండూర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌లు వేర్వేరుగా ముస్లింలకు బక్రీద్ వేడుకలను పురష్కరించుకొని శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేశారు. మండల అధ్యక్షులు ఎస్ రవీంద్రాచారి, గసిగంటి సంపత్, కొత్తకొండ శంకర్, జడల రమేశ్, ఎండీ గౌస్‌ఖాన్, ఎండీ తాజోద్దీన్, ఖాజాబాయ్, నాసీర్‌ఖాన్ ముస్లింలు పాల్గొన్నారు.

రామడుగు : మండలంలోని పలు గ్రామాలలో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురష్కరించుకొని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గంగాధర : గంగాధర మండలంలో బక్రీదు వేడుకలు ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గంగాధరలో బక్రీదు వేడుకల సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చొప్పదండి: మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా చొప్పదండిలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు,

కెనాల్ భూమి విక్రయించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, జూన్ 17: రైతులను మోసగిస్తూ కెనాల్ భూమిని అక్రమంగా విక్రయించిన కాసం రాజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని వీణవంక మండలం గంగారం గ్రామ రైతు వీణవంక ఎమ్మార్వోను కోరారు. కాసం గోపాల్‌రెడ్డికి వీణవంక మండల పరిధిలోని ఎల్బాక రెవెన్యూలో సర్వేనెంబర్ 651/ఎలో రెండు ఎకరాల 39 గుంటల భూమి ఉంది. ఇందులో నుంచి ఎకరం 30 గుంటల పట్టాభూమి ఎల్ఎండిడిబిఎం-7 కెనాల్‌లో పోయింది. కెనాల్‌లో పోయిన భూమికి సంబంధించిన డబ్బులను తీసుకున్నాడు. ఆ భూమి కెనాల్ కింద తీసివేయలేదు. అయితే కాసం గోపాల్‌రెడ్డి కుమారుడు కాసం రాజిరెడ్డి సంగాల మధుకర్‌కు ఎకరం 5 గుంటలు, సంగాల దుర్గమ్మకు ఎకరం 5 గుంటలు అమ్ముకున్నాడు. గోపాల్‌రెడ్డికి ఉన్న భూమి 2.39 ఎకరాల్లో 1.30 గుంటల భూమి కెనాల్‌లో పోగా మిగిలిన 1.09 భూమికి బదులుగా ఆయన కుమారుడు రాజిరెడ్డి రెండు ఎకరాల 10 గుంటల భూమిని అమ్ముకున్నాడు. ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకున్న కెనాల్ భూమిని విక్రయించిన రాజిరెడ్డిపై చర్య తీసుకొని కెనాల్‌లో పోయిన ఎకరం 30 గుంటల భూమిని ఆన్‌లైన్ నుంచి తీసివేయాలని రైతు కోరారు.

దక్షిణభారత ఉషు పోటీల్లో జీనత్‌కు రజత పతకం



జీనత్ అంజమ్‌ను అభినందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్17: కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోటలో నిర్వహించిన 10నుంచి 13వరకు జరిగిన దక్షిణ భారత ఖేలో ఇండియా ఉషు పోటీల్లో జిల్లాకు చెందిన జీనత్ అంజమ్ పాల్గొని రజతపతకం సాధించింది. ఈ పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉషు అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమె 60కిలోల విభాగంలో పోటీ పడి పలు రాష్ట్రాల క్రీడాకారులపై విజయం సాధించి రజత పతకం సాధించిందని కరీంనగర్ జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్ తెలిపారు. పతకం సాధించిన క్రీడాకారిణిని కరీంనగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి సోమవారం ప్రశంసాపత్రం, పతకం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉషు కోచ్ మోహిన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

తిమ్మాపూర్, జూన్ 17: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డిని సోమవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కోమల అంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, కాసింపేట ఎంపీటీసి స్వప్నచంద్రారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు ముదిగంటి విద్యాసాగర్‌రెడ్డి, కొత్తకొండ వెంకట సాయి, పారిపల్లి రాజు పాల్గొన్నారు.

బీసీ రుణాల చెక్కులు ఏవీ?



సమావేశంలో మాట్లాడుతున్న ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి

జమ్మికుంట, జూన్ 17: బీసీ రుణాల చెక్కులు తన వద్ద ఉన్నాయని, ఎన్నికల తర్వాత లబ్ధిదారులకు ఇస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారని, అవి ఎక్కడికి పోయాయో ప్రజలకు ఆయన తెలపాలని ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులాల్లోని కుల వృత్తుల వారందరు లక్ష రుపాయాల రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికలకు ముందు కౌశిక్‌రెడ్డి చెప్పారన్నారు. ఆరఖాస్తులు చేసుకున్న వారందరికీ చెక్కులు వచ్చాయని, అవి తన వద్ద ఉన్నాయని నమ్మబలికారని గుర్తు చేశారు. బీసీ రుణాలు ఇప్పటి వరకు ఎంత మందికి వచ్చాయి, ఎన్ని చెక్కులు పంపిణీ చేశారో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్, మాజీ సర్పంచ్ మహేందర్, కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య, బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడెపు సారంగపాణి పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలి'

హుజూరాబాద్‌రూరల్, జూన్ 17: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు పెట్టకుండా ఆగస్టు 15లోగా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి కోరారు. మండలంలోని సిర్సపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదాయ పన్ను చెల్లించేవారికి, రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ప్రకటించడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. చిన్న, సన్నకారు రైతుల్లో చాలా మందికి రేషన్ కార్డులు లేవని, కొంతమంది ఆదాయ పన్ను చెల్లిస్తున్నారన్నారు. ఎటువంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చొప్పదండి, జూన్ 17: చొప్పదండి లయన్స్ క్లబ్ కార్యవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. మొదటి ఉప గవర్నర్ సింహరాజు కోదండరాం ఈ కార్యక్రమానికి హాజరై కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మహేశుని మల్లేశం, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నర్సింహస్వామి కల్యాణం



కొత్తగట్టులో నర్సింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శంకరపట్నం, జూన్ 17: మండలంలోని కొత్తగట్టు గుట్టపై నర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉగ్ర నర్సింహస్వామి కల్యాణం సోమవారం అర్చకులు శేషం మురళీధరాచార్యులు వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకునానరు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కేంబ్రిడ్జి పాఠ్య ప్రణాళికతో ఐవీవైలో బోధన



ఐవివై పాఠశాలను జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభిస్తున్న దృశ్యం

భగత్‌నగర్/కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 17: కేంబ్రిడ్జి పాఠ్య ప్రణాళికతో ఐవీవై అంతర్జాతీయ పాఠశాలలో విద్యాబోధన చేపట్టనున్నట్లు పాఠశాల చైర్మన్ పసుల మహేష్ అన్నారు. ఆదివారం నగరంలోని సీతారాంపూర్‌లో ఐవివై అంతర్జాతీయ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలతో పూర్వ ప్రాథమిక విద్యార్థులకు ఆట, పాటల ద్వారా విద్యాబోధన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు ప్రాజెక్ట్ బేస్డ్ డిజిటల్ తరగతుల ద్వారా అనుభవం గల ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. నేటి తరం విద్యార్థులు చదువుతో పాటు అన్నింటా ముందుండాలని పాఠశాలను అన్ని హంగులతో ప్రారంభించామన్నారు. సిద్దార్థ పాఠశాలతో ఐవివై అంతర్జాతీయ పాఠశాల అనుసంధానం కావడంతో వినూత్నమైన ఆలోచనతో నేటి తరం విద్యార్థులను గ్లోబల్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ పాఠశాల చైర్మన్ శ్రీపాల్‌రెడ్డి, పారమిత పాఠశాల చైర్మన్ ప్రసాదరావు, ఐవీవై పాఠశాల ప్రధానోపాధ్యాయులురాలు పసుల జయశ్రీ పాల్గొన్నారు.

స్ఫూర్తి పురస్కారానికి రవికుమార్ ఎంపిక



రవికుమార్

సుభాష్‌నగర్, జూన్ 17: వసుందర విజ్ఞాన వికాస మండలి 31వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి స్ఫూర్తి పురస్కారాలు అంద చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన పసుల రవికుమార్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈ పురస్కారం అందజేస్తున్నట్లు వసుంధర విజ్ఞాన వికాస మండలి వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారం త్వరలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతులమీదుగా అందచేస్తారని పేర్కొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన కరీంనగర్ గ్రానైట్ ఇండస్ట్రీస్ సమన్వయ కమిటీ సభ్యులు



మంత్రిని కలిసిన గ్రానైట్ ఇండస్ట్రీస్ సమన్వయ కమిటీ సభ్యులు

కరీంనగర్ అర్బన్, జూన్17: కరీంనగర్ జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ సమన్వయ కమిటీ సభ్యులు, క్వారీ ఓనర్స్ సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, గనులు భూగర్భశాఖ డైరెక్టర్ సుశీల్ కుమార్‌లను కలిశారు. జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు మంత్రికి వివరించి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా గ్రానైట్ ఇండస్ట్రీస్ సమన్వయ కమిటీ సభ్యులు ప్రణీత్‌రావు, నరెన్, షేక్‌పాషా, గ్రానైట్ ఓనర్స్ వేణు కార్వా, గంగుల సుధాకర్, రామారావు తదితరులు ఉన్నారు.

వైభవంగా నిర్జల ఏకాదశి



ఏకాదశి ఉత్సవంలో పాల్గొన్న రమణాచార్యస్వామి, భక్తులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 17: స్థానిక తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో (శ్రీనిలయం) సోమవారం నిర్జల ఏకాదశి ఉత్సవాన్ని పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ స్వామికి అభిషేక అర్చనలు జరిపారు. అనంతరం హవనం, సామూహిక విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. కార్యక్రమంలో నమిలకొండ రామకృష్ణమాచార్యులు, రమేశ్‌స్వామితో పాటు పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఎమ్మెల్యే చేయూత



అంజన్‌కు రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం/తిమ్మాపూర్, జూన్ 17: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిరుపేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందించారు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి గొర్రె అంజన్ కేరళలోని కాలికట్ ఎన్ఐటీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షలకు ఫీజు కట్టే ఆర్థిక స్తోమత లేకపోవడంతో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో సంప్రదించారు. ఆయన స్పందించి 50వేలు ఆర్థిక సహాయం అందించారు. అంజన్ చదువు పూర్తయ్యే వరకు అన్ని విధాలుగా సహాయం చేస్తానని భరోసా కల్పించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విద్యార్థి గొర్రె అంజన్ కృతజ్ఞతలు తెలిపాడు.

'బీసీల హక్కుల సాధనకు పోరాడుతా'

హుజూరాబాద్, జూన్ 17: బీసీల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తానని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె సంజయ్‌కుమార్ అన్నారు. హుజూరాబాద్‌లో బీసీ సంఘం నాయకులు సంజయ్‌కుమార్‌ను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77 సంవత్సరాలుగా ఏ రాజకీయ పార్టీ నాయకులు బీసీలను గుర్తించలేదన్నారు. గ్రామగ్రామాన బీసీలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రామచంద్రం, శ్రీనివాస్, తిరుపతి, రాజగోపాల్, సాయిచంద్, సత్యనారాయణ, శ్రవణ్, సాయి, వేణు, కుమార్, రాజ్‌కుమార్, కొంరయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

శంకరపట్నం, జూన్ 17: రచయిత్రి అరుంధతిరాయ్, విప్లవ కవి వరవరరావు తదితరులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 14ఏళ్ల తర్వాత ఊపా కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులపై ఈ కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. వెంటనే ఊపా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని వెంకటస్వామి డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జమ్మికుంట, జూన్ 17: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జూలై 7న వరంగల్‌లో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ కోరారు. ఆదివారం జమ్మికుంటలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదిగలు, మాదిగ ఉప కులాలు ఆవిర్భావ వేడుకలకు సమాయత్తం కావాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ అంశంలో మందకృష్ణమాదిగ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. సమావేశంలో నలిగంటి శరత్, రామంచ భరత్, ముక్కెర సంపత్‌కుమార్, డాక్టర్ కట్కూరి మహేందర్ పాల్గొన్నారు.

తీగల వంతెన నిర్మాణం అవినీతిమయం

● డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్ కుమార్

కరీంనగర్ అర్బన్, జూన్ 17: కరీంనగర్ శివారులో మానేరు వాగుపై 200 కోట్ల రూపాయలతో నిర్మించిన తీగల వంతెన అవినీతిమయమైందని డీసీసీ ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శిం చారు. స్థానిక మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే, మేయర్, ఎంపీలు అట్టహాసంగా ప్రారంభించిన కేబుల్ బ్రిడ్జి కొద్ది నెలలకే నాణ్యత లోపాలు బయడపడ్డాయన్నారు. రూ.200 కోట్ల ప్రజాధనం వృధా చేశారని ఆరోపించారు. ప్రపంచ వింతలాగా, లక్షల మందికి లబ్ధి చేకూర్చేదిగా కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో కోట్ల రూపాయల ఖర్చుతో డాన్స్, లేజర్ షోలు పెట్టి ఎమ్మెల్యే, మేయర్ ప్రజలని మభ్యపెట్టారని అన్నారు. కేబుల్ బ్రిడ్జి ఖర్చు, నాణ్యతపై చర్చ జరగాలన్నారు. నగర నడిబొడ్డున నవరన్ స్ట్రీట్‌లో దశాబ్దాలుగా నెహ్రూచౌక్‌లో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని తొలగించిన నగరపాలక సంస్థ నాలుగేళ్లుగా ఆయన విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించడం లేదన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ శానిటేషన్ జవాన్‌లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టకుండా గత ప్రభుత్వంలోని పాలకవర్గం వారికి అనుకూలంగా విధులు చేపట్టేలా మార్చు కున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే కొన్ని డివిజన్‌లపై నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

రికార్డు కోసం 1,008 మందితో కోలాటం



కోలాటంలో పాల్గొన్న మహిళలతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూన్ 17: పట్టణంలోని మధువని గార్డెన్‌లో సోమవారం 1008 మంది మహిళలు గోవింద నామస్మరణతో కోలాట మహాబృంద నృత్యం జరిగింది. హుజూరాబాద్‌లోని తపస్వీ డ్యాన్స్ అకాడమీ శ్రీశాంతి కృష్ణసేవా సమితి గ్లోబల్ డివోషనల్ ఆధ్వర్యంలో రికార్డు కోసం కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా కళాకారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం కోలాట బృందాలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు గందె రాధిక, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు శ్వేత పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలి

హుజూరాబాద్, జూన్ 17: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం అలుపెరగని పోరాటాలు చేసి చివరికి ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ప్రాణత్యాగాలు చేసుకుని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, జనార్దన్, ఆర్య, సాగర్, భువన్, రాజేష్ పాల్గొన్నారు.

'మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి'



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న సంఘం నాయకులు

సైదాపూర్, జూన్ 17: రాష్ట్రంలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రవీందర్, ఉపాధ్యక్షుడు పెసరు కుమారస్వామి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి మత్స్యకారుల సమస్యలను వివరించారు. మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులుగా నేరుగా సంఘాలకు డబ్బులు చెల్లించాలన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో నూతన సభ్యత్వాలు కల్పించే అధికారం డీఎఫ్‌వోలకే ఇవ్వాలని, అర్హులైన మత్స్యకారులకు రెండో విడత వాహనాలను పంపిణీ చేయాలని కోరారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించి వారి అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరారు. మంత్రితో పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.